క్లుప్తంగా

26,27వ తేదీల్లో సీపీఐ జిల్లా మహాసభలు



మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆనందరావు, తదితరులు

తెర్లాం: సీపీఐ 14వ జిల్లా మహాసభలను ఈనెల 26,27వ తేదీల్లో బొబ్బిలిలో నిర్వహించనున్నట్టు ఆపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అలమండ ఆనందరావు తెలిపారు.మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను మండల కేంద్రంలో శనివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని సమస్యలపై మహాసభలో సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులు చర్చించి తీర్మానం చేస్తారని తెలిపారు. సభలకు కార్మికులు, కర్షకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. స్థానిక సీపీఐ నాయకుడు చింతాడ రామారావు, హమాలీల సంఘం సభ్యుడు పాల్గొన్నారు.

పరామర్శ



కృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

రేగిడి: మండలంలోని కె.వెంకటాపురం గ్రామానికి చెందిన మాజీ రేషన్ డీలర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు పరశురావు కృష్ణ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. కె.వెంకటాపురంలో ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శనివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి సంతాపం తెలిపారు. పరామర్శించిన వారిలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెంనాయుడు, వావిలపల్లి జగన్ మోహనరావు, రాష్ట్ర పోలినాటి వెలమ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కింజరాపు సురేష్, అప్పాపురం, లక్ష్మీపురం సర్పంచ్‌లు కరణం శ్రీనివాసరావు, కెంబూరు వెంకటేశ్వరరావు ఉన్నారు.

మాదకద్రవ్యాల రవాణాపై నిఘా



చెక్ పోస్టు వద్ద పోలీస్ అధికారులు, సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎస్పీ భవ్యారెడ్డి

రామభద్రపురం: మాదక ద్రవ్యాల రవాణా నియంత్రణపై పటిష్ట నిఘా పెట్టామని డీఎస్పీ భవ్యారెడ్డి తెలిపారు. గ్రీన్ ఫీల్డ్ హైవేలో కొండ కెంగువ వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును శుక్రవారం రాత్రి ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రామభద్రపురం మండలం ఒడిశా బోర్డర్‌లో ఉండడం వల్ల అక్రమార్కులు మండలాన్ని మాదక ద్రవ్యాల రవాణాకు సులభ మార్గంగా ఎంచుకుంటున్నారన్నారు. మాదక ద్రవ్యాలు, నిషేధిత వస్తువల రవాణా నియంత్రణకు ఈచెక్ పోస్టు దోహదపడుతుందని తెలిపారు. చెక్ పోస్ట్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు.డీఎస్పీ వెంట సీఐ కె.నారాయణరావు,ఎస్ఐ వి.ప్రసాదరావు ఉన్నారు.

ఆస్పత్రి మరమ్మతుల పరిశీలన



మరమ్మతుల పనులను పరిశీలిస్తున్న ఆస్పత్రిసూపరింటెండెంట్ హరిబాబు

రాజాం: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మరమ్మతుల పనులను ఆస్పత్రి సూపరింటెండెంట్ కరణం హరిబాబు శనివారం పరిశీలించారు. గ్రౌండ్‌ఫ్లోర్‌తో పాటు ఫస్ట్ ఫ్లోర్‌లో పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆస్పత్రి అభివృద్ధి నిధులు రూ.6 లక్షలతో ఈ పనులు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. మరుగుదొడ్లు, వార్డులు బాగుచేయిస్తున్నామని వెల్లడించారు.

చిన్నారులకు వ్యాక్సినేషన్



చిన్నారులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

తెర్లాం: చిన్నారులు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు వ్యాక్సిన్‌లు వేస్తున్నామని స్థానిక సచివాలయ ఎంఎల్‌హెచ్‌పీ శ్రీదేవి, ఏఎన్ఎం అన్నామణి తెలిపారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రం-5 లో ఆ కేంద్రంలోని పలువురి చిన్నారులకు శనివారం టీకాలు వేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రమం తప్పకుండా చిన్నారులకు టీకాలు వేయించాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్త వై.శ్రీదేవి, హెల్పర్ లక్ష్మి, ఏఎన్ఎంలు సరోజినమ్మ, చిన్నమ్మలు పాల్గొన్నారు.

ఆడబిడ్డకు శఠగోపం..!

- అమలుకు నోచుకోని ఆడబిడ్డ నిధి పథకం
- 18 నుంచి 59 సంవత్సరాల లోపు మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు
- టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా హామీ ఊసే ఎత్తని ప్రభుత్వం
- ఇప్పటికే ఒక్కో మహిళకు రూ.18 వేలు బకాయి
- బొబ్బిలి నియోజకవర్గంలో 97,560 మంది మహిళలు ఎదురు చూపు



రామభద్రపురం:

అధికారం కోసం మాయమాటలు చెప్పడం, బూటకపు హామీలు ఇవ్వడం, ప్రజలను ఏమార్చడంలో సీఎం చంద్రబాబు కాకలు తీరారు. ఓట్ల కోసం అలవి కాని హామీలు గుప్పించడంలో పండిపోయారు. ప్రజల ఓట్లతో పీఠం ఎక్కి, తర్వాత ఓట్లేసిన ప్రజలనే బురిడీ కొట్టించడంలో పీహెచ్‌డీ చేశారు. ప్రతీ ఎన్నికల్లో ఇష్టారీతిగా హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చాక వాటికి ఎగనామం పెట్టడం చంద్రబాబుకు పరిపాటే. ప్రజలు తనను నమ్మడం లేదని తెలుసుకుని తాను మారిన మనిషినని, సంపద సృష్టించి పథకాలు అమలు చేస్తానని 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో చంద్రబాబు విస్తృతంగా ప్రచారం చేశారు. కానీ ఆయన్ని నమ్మిన అన్ని వర్గాల ప్రజలతో పాటు మహిళలకు కూడా శఠగోపం పెట్టారు.2014 ఎన్నికల్లో డ్వాక్రా రుణమాఫీ చేస్తానని మోసం చేస్తే..ఈసారి ఆడబిడ్డ నిధి పథకం పేరుతో మోసం చేశారు. టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే 18 నుంచి 59 ఏళ్ల లోపున్న మహిళలకు ఆడబిడ్డ నిధి పథకం కింద నెలకు రూ.1500 చొప్పున, ఇంట్లో ఎంతమంది మహిళలు ఉంటే అంతమందికీ ఇస్తామని చంద్రబాబు, కూటమి నేతలు హామీ ఇచ్చారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిపోయినప్పటికీ ప్రభుత్వం ఆడ బిడ్డ నిధి పథకం ఊసే ఎత్తడం లేదు.నమ్మి ఓట్లు వేసినందుకు చంద్రబాబు తమకు మరోసారి టోపీ పెట్టేందుకు చూస్తున్నారని మహిళలు మండిపడుతున్నారు.

బొబ్బిలి నియోజకవర్గంలో 18 నుంచి 59 ఏళ్ల లోపు మహిళలు, బకాయిల వివరాలు

మండలం	మహిళలు	బకాయి
బొబ్బిలి	46,686	రూ. 84,03,48,000
రామభద్రపురం	15,829	రూ. 28,49,22,000
బాడంగి	15,575	రూ. 28,03,50,000
తెర్లాం	19,469	రూ. 35,04,42,000

రూ.175.60 కోట్లు బకాయి..

నియోజకవర్గంలోని రామభద్రపురం,బొబ్బిలి,తెర్లాం,బాడంగి మండలాల్లో 18 నుంచి 59 ఏళ్లలోపు మహిళలు 97,560 మంది ఉన్నారు. వీరికి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.1500 చొప్పున రూ.14,63,40,000 చెల్లించాల్సి ఉంటుంది. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది దాటిపోయింది. 12నెలలకు రూ. 175,60,80,000 లు చెల్లించాల్సి ఉంది. ఏడాది గడిచినా పథకం అమలుపై మంత్రివర్గ సమావేశాల్లో చర్చించకపోవడం, ఆ ఊసే ఎత్తకపోవడంతో మహిళలకు నిరాశే మిగిలింది. సూపర్ సిక్స్‌తో పాటు ఇచ్చిన వందల హామీల్లో ఒకటి రెండు పథకాలను అది కూడా అరకొరగా అమలు చేశారే తప్ప ఇంకా ఏపథకాలు అమలుకునోచుకోలేదు.

బుద్ధి చెబుతాం..



అధికారంలోకి రాక ముందు ఒకలా,వచ్చాక మరోలా కూటమి వ్యవహరిస్తోంది. 18 ఏళ్లు దాటిన ప్రతీ మహిళకు ఆడబిడ్డ నిధి పథకం కింద నెలకు రూ.1500 చొప్పున ఇస్తామని కూటమి నాయకులు మహిళలను నమ్మించి ఓట్లు వేయించుకున్నారు. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మాటను మరచిపోయారు. మహిళలంతా వచ్చే ఎన్నికల్లో కూటమికి తగిన రీతిలో బుద్ధి చెబుతాం.

– కనిమెరక సుజాత,రామభద్రపురం

బకాయితో కలిపి ఇవ్వాలి..



టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి సంవత్సరమైంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదు. ఆడబిడ్డ నిధి పథకం ఎప్పుడు అమలు చేస్తారా అని మహిళలంతా ఎదురు చూస్తున్నారు. సంపద సృష్టించి పథకాలు ఇస్తామని చెప్పారుగా, ఇవ్వండి మరి. ఆడబిడ్డ నిధి కింది ఇస్తామని డబ్బులను మొత్తం బకాయితో కలిపి చెల్లించాలి.

– కురిడి సుంద్రమ్మ, జోగిందొరవలస

మోసం చేయడం సరికాదు..



అధికారంలోకి రాగానే మహిళలకు నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు ఇస్తామన్నారు. ఏడాదవుతున్నా ఆ ఊసే లేదు.ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ హామీనీ అమలు చేయ డం లేదు. సూపర్ సిక్స్ పథకాల కోసం ఎదురు చూస్తున్నాం. కూటమి నేతలు మాటలతో కాలయాపన చేస్తున్నారు. మాటతప్పి మోసం చేయడం సరికాదు.

– సిరిపురం సత్యవతి,వంగపండువలస

నమ్మకం పోయింది..



ఆడబిడ్డ నిధి పథకాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్న నమ్మకం పోయింది. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిపోయినప్పటికీ పట్టించుకున్న పాపాన పోలేదు.ఎప్పుడు ఇస్తారో చెప్పడం లేదు. ఈ పథకం అమలవుతుందన్న ఆశ లేదు.

– బోను కృష్ణవేణి, పాడివానివలస

17 నుంచి 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శంబంగి, పార్టీ నాయకులు, కౌన్సిలర్లు

- కరపత్రాలు ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: ఎన్నికల హామీలను అమలు చేయకుండా టీడీపీ కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం పేరిట ఇంటింటికీ వివరించనున్నామని మాజీ ఎమ్మెల్యే, బొబ్బిలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త శంబంగి వెంకట చిన అప్పలనాయుడు తెలిపారు. స్థానిక వైఎస్సా ర్‌సీపీ కార్యాలయంలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కరపత్రాలను నాయకులతో కలిసి శనివారం ఆయన ఆవిష్కరించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ ఈనెల 17న బొబ్బిలి మున్సిపాలిటీలోని ఒకటో వార్డులో కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ సాగిస్తున్న దుర్మార్గ పాలనను, హామీలు అమలులో ప్రభుత్వ వైఫల్యాన్ని, మోసాలను ప్రజలకు వివరిస్తామన్నారు.

ఆ వార్డుల్లో కొత్త ఇన్‌చార్జ్‌లు..

ఇటీవల మున్సిపాలిటీలో జరిగిన అన్యాయపు అవిశ్వాసానికి మద్దతు పలికిన మున్సిపల్ కౌన్సిలర్ల స్థానంలో కొత్త నాయకులకు అవకాశం ఇచ్చినట్టు శంబంగి తెలిపారు. డబ్బు కోసం పార్టీకి, ఓట్లేసిన ప్రజలకు నమ్మక ద్రోహం చేసిన ఆ కౌన్సిలర్లను వైఎస్సార్‌సీపీ నుంచి సస్పెండ్ చేయాలని ప్రతిపాదించగా జిల్లా పార్టీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అధిష్టానానికి తెలియపర్చారన్నారు. పార్టీ ఆదేశాలతో ఆయా వార్డుల్లో ఇప్పటికే కొత్తగా ఇన్‌చార్జ్‌లను నియమించినట్టు చెప్పిన ఆయన వారి పేర్లను సోమవారం ప్రకటిస్తామని విలేకరులకు తెలిపా రు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు, మున్సిపల్ మాజీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లు ఎస్.వి.మురళీకృష్ణారావు, గొలగాని రమాదేవి,కౌన్సిలర్లు సవలాపురపు రామకృష్ణ,పాలవలస ఉమాశంకర్, కోట పెదరాములు,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



రాజాం: పెనుబాకలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు



వంగర: నీలయ్యవలసలో చెత్తసేకరణను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ రామారావు

రాజాం: పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పెనుబాక గ్రామంలో పారిశుద్ధ్య పనుల నిర్వహణను శనివారం పరిశీలించారు.గ్రామంలోని వీధికాలువలో పూడిక తీతలు చేపడుతున్న క్లాప్ మిత్రకు పలు సూచనలు చేశారు. రోజూ ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి చెత్తనుంచి సంపద తయారీ కేంద్రానికి(ఎస్ డబ్ల్యూపీసీ) తరలించాలని చెప్పారు. గ్రామ ప్రజలకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వర్షకాలంలో తీసుకోవా ల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు.

పరిశుభ్రత పాటించాలి

వంగర: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఈఓపీఆర్డీ కెల్ల రామారావు అన్నారు. మండల పరిధి నీలయ్యవలస, శ్రీహరిపురం గ్రామాల్లో క్లాప్ మిత్రలు శనివారం ఉదయం చేపట్టిన చెత్తసేకరణ పనులను పరిశీలించారు. ఇంటివద్దకు వచ్చే క్లాప్ మిత్రకు తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందివ్వాలని మహిళలకు సూచించారు. తాగు నీరు కలుషితం కాకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శికి సూచనలు చేశారు.

నాలుగు నెలలుగా అందని జీతం



జీతాలు చెల్లించాలని కోరుతున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

రేగిడి: ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రభుత్వం నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం తక్షణం జీతాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు, కార్యదర్శి సురేష్ కుమార్ డిమాండ్ చేశారు.మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద రాజాం, వంగర, రేగిడి, సంతకవిటి మండలాలకు చెందిన ఫీల్డ్ అసి స్టెంట్లతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సకాలంలో జీతాలు చెల్లించకపోవ డంతో ఫీల్డ్ అసిస్టెంట్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగభద్రత కల్పించ డంతోపాటు టార్గెట్ విధానాన్ని రద్దుచేయాలని కోరారు. అంతకు ముందు ఫీల్డ్ అసిస్టెంట్లు ర్యాలీ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం నాయకులు లక్ష్మణరావు, జగన్నాథంనాయుడు, సుజాత, పి.లక్ష్మి, లావణ్య, తమ్మినాయుడు, నర్సింగరావు, గంగరావు, పోలినాయుడు, ఆదినారాయణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

20న పీఆర్ ఉద్యోగుల సంఘం ఎన్నికలు



ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేస్తున్న పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగులు

బొబ్బిలి: ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం బొబ్బిలి యూనిట్ ఎన్నికలు ఈనెల 20వ తేదీన నిర్వహించను న్నట్టు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జొన్నాడ విక్టర్, చుక్క శ్రీనివాసరావు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్‌ను సహోద్యోగులతో కలిసి శనివారం విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జూలై 20న ఉదయం 9 గంటలకు నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుందని చెప్పారు. నామినేషన్లు ఎక్కువ వచ్చిన పక్షంలో 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఎన్నిక నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎన్నికల అధికారిగా పి.ఎం. రవికుమార్, అబ్జర్వర్‌గా ఎం.శ్రీరాములు వ్యవహరిస్తారని చెప్పారు. ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని బొబ్బిలి యూనిట్ పరిధిలో ఉన్న బొబ్బిలి, సీతానగరం,బలిజిపేట మండలాల పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగులంతా హాజరు కావాలని కోరారు.

ఎండిపోతున్న నారుమడులు



భీమవరంలో వాడిపోతున్న వరినారు



బాడంగిలో చెరువు నీటిని కిరోసిన్ ఇంజిన్‌తో నారుమడికి తోడుతున్న దృశ్యం

బాడంగి: వేసవిని తలపించేలా గత ఐదురోజులుగా కాస్తున్న ఎండల తీవ్రతకు వరి నారుమడులు ఎండిపోయి చని పోతున్నాయి. జూన్ నెలాఖరులో వర్షాలు ప్రారంభమై వారం రోజుల క్రితం వరకు అడపాదడపా కురిసినప్పటికీ అవి నారుమడులకు ఉపయోగపడే స్థాయిలో కురవలేదని రైతులు అంటున్నారు. ఎండలుబాగా కాయడంతో నారుమడులు పొడి బారిపోయాయి.వ్యవసాయ బోర్లున్నవారు నారుమడులకు నీటి తడులు అందించి కాపాడుకుంటుండగా, బోర్లు లేని వారు తమ పొలాలకు సమీపంలో ఉన్న చెరువుల నుంచి కిరోసిన్ ఇంజిన్లతో నీటిని తోడుకుంటూ నారుమడులకు నీటి తడులు అందిస్తూ కాపాడుకుంటున్నారు.

పచ్చిరొట్ట.. పైరుకు మేలు

- పచ్చిరొట్ట ఎరువుల సాగుపై రైతులు ఆసక్తి
- వీటి సాగుతో రసాయన ఎరువుల కొరత నుంచి ఉపశమనం
- విత్తనాలు చల్లిన తర్వాత నెల రోజుల్లో పంట కోతదశకు
- చేనును కలియదున్నడంతో నేలకు సారం



రేగిడి మండలంలోని తునివాడ సమీపంలో సాగులో ఉన్న కట్టె జనుమ



రాజాం మండలంలోని నందబలగ సమీపంలో సాగులో ఉన్న జీలుగ పంట

రాజాం: ఖరీఫ్ సాగు ఈ ఏడాది ముందుగానే ప్రారంభమయ్యింది. ఇప్పటికే మెరక ప్రాంతాల్లో రైతులు మొక్కజొన్న పంటలు సాగుచేస్తున్నారు. వీటికి సరిపడే ఎరువులు రైతుకు లభించడంలేదు. మరో నెలరోజుల్లో ఖరీఫ్ వరినాట్లు ప్రారంభం కానున్నాయి. వరి సాగు చేయాలనుకునే రైతులు ఎరువు కొరత నివారణకు ఇప్పటి నుంచే ప్రత్యామ్నాయ పద్ధతుల వైపు దృష్టిసారిస్తున్నారు. ఈ సమయంలో పచ్చిరొట్ట ఎరువులు సాగు చేయడం ద్వారా నేల సారవంతమవుతుందని, మంచి ఉపయోగం ఉంటుందని, సేంద్రియ ఎరువుల తయారీపై దృష్టిసారించాలని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

సహజ పద్ధతిలో సత్తువ

భూమి కోల్పోయిన పోషకాలను సహజ పద్ధతిలో పునరుద్ధరించేందుకు ఉత్తమమైన మార్గం పచ్చిరొట్ట పంటల సాగు. నేల స్వభావానికి అనుగుణంగా పచ్చిరొట్ట పంటలైన కట్టె జనుమ, జీలుగ, పిల్లి పెసర సాగుచేసి భూములను సారవంతంగా మార్చుకోవచ్చు. పూత దశలో ఉన్న పచ్చిరొట్ట పంటను ఖరీఫ్ పంట సాగుకు ముందు పొలంలో కలియదున్నడం వల్ల అవి కుళ్లి నత్రజని, తదితర పోషకాలు అత్యధిక పరిమాణాల్లో నేలకు అందిస్తాయి. పశువుల పేడకంటే పచ్చిరొట్ట పైర్లు పదిరెట్లు అధికంగా నేలను సారవంతం చేస్తాయి. తద్వార కృతిమంగా నత్రజని, భాస్వరం వాడకం కూడా తగ్గించుకుని, నాణ్యమైన పంట దిగుబడి పొందవచ్చు. భూమికి నీటిని, పోషకాలను నిలువ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. నేలలో కలియదున్నిన పంట కుళ్లిన తర్వాత విడుదలచేసే భాస్వరం, పొటాష్‌తో పాటు గాలిలోని నత్రజని నేలలో స్థిరీకరిస్తాయి. తద్వారా నేలసారం పెరుగుతుంది. సూక్ష్మపోషకాలు మొక్కలకు అందుతాయి. సూక్ష్మజీవుల సాంద్రత పెరిగి మొక్కల వేర్లు పటిష్టమవుతాయి. పచ్చిరొట్ట ఎరువులు ఆశించిన మేర ఫలితాలు ఇస్తుండడంతో రైతులు వీటి సాగు వైపు మొగ్గుచూపుతున్నారు. ఏటా వీటి సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో పొలాల్లో దుక్కిచేసి పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు వేసుకుంటే వరినాట్లు సమయానికి చేను తయారయ్యే అవకాశం ఉంటుంది. అయితే గత ప్రభుత్వంలో మాదిరిగా పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు రైతులకు రాయితీపై అందడం లేదు. గ్రామాల్లోని కొన్ని రైతు సేవా కేంద్రాల్లో మాత్రమే కట్టె జనుమ, జీలుగ,పిల్లిపెసర విత్తనాలను 50 శాతం రాయితీతో పంపిణీ చేస్తున్నారు. ప్రైవేటు ఎరువుల దుకాణాల్లో ఇవి విరివిగా లభిస్తున్నాయి.

భూమి సారవంతమవుతుంది



పచ్చిరొట్ట పంటల సాగుతో భూమి సారవంతంగా తయావుతుంది. ఖరీఫ్‌లో ప్రధాన పంట వేసే ముందుగా రైతులు విధిగా పచ్చిరొట్ట సాగుచేయాలి. రైతు సేవా కేంద్రాల్లో ముందుగా చెబితే 50 శాతం రాయితీతో ఈ విత్తనాలు అందజేస్తారు. వీటిని సాగు చేసిన పొలాల్లో ప్రధాన పంటకు రసాయన ఎరువులను పెద్దగా వేయాల్సిన పని ఉండదు. వీటిని సాగుచేయడం వల్ల ప్రతికూల పరిస్థితులను కూడా ప్రధాన పంట తట్టుకుని నిలబడుతుంది. ఎకరానికి కట్టె జనుము అయితే 16 నుంచి 20 కిలోల విత్తనాలు, జీలుగ అయితే 12 నుంచి 16 కిలోలు, పిల్లిపెసర అయితే 5 నుంచి 6 కిలోలు చల్లాలి. వీటిలో ఏరకం సాగు చేసినా మంచి ఫలితాలే వస్తాయి.

– కె.చంద్రరావు, వ్యవసాయశాఖ ఏడీఏ, రాజాం

నేడు నేత్రవైద్య శిబిరం

వంగర: స్థానిక వివేక్‌మాస్టర్ మైండ్స్ హైస్కూల్ ఆవరణలో ఆదివారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించను న్నట్టు స్పందన స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు సాదెం వెంకటరమణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. శిబిరంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి చెందిన ఆప్తాలమిక్ సేవలందిస్తారని పేర్కొన్నారు. మండలంలో కంటి ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తాగునీరు అందక అవస్థలు

రేగిడి: మండలంలోని బొడ్డవలస, సంతకవిటి మండలంలోని జావాం వద్ద ఉన్న పంపుహౌస్‌ల్లో పనిచేస్తున్న సిబ్బందికి ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడంతో వారు విధులు బహిష్కరించా రు. దీంతో రేగిడి, సంతకవిటి, రాజాం మండలాల్లోని కొన్ని గ్రామాలకు తాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంట పొలాల్లోని నేల బావులు, వ్యవసాయ మోటార్లను ఆశ్రయించాల్సి వస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే తాగునీటి సరఫరాను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

బొబ్బిలి / రాజాం

9951602891, 9951602843

Office mail : vzmadvt@gmail.com